ప్రజాశక్తి
శుక్రవారం 24 మార్చి 2023
5
శ్రీకాకుళం

రేపు జెడ్పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థాయీ సంఘాల సమావేశం ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం పది గంటలకు 6వ స్థాయి, 11 గంటలకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12 గంటలకు 5వ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు 2వ స్థాయి, 3 గంటలకు 4వ స్థాయి, సాయంత్రం 4 గంటలకు 7వ స్థాయి, 5 గంటలకు ఒకటో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆగని అక్రమ రవాణా

జిల్లాలో రేషన్ బియ్యమే కొందరికి వ్యాపార సరుకుగా మారిపోయింది. బియ్యం అవసరం లేని వారి నుంచి చౌకగా కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా రేషన్ బియ్యం, వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నా, అక్రమ రవాణాకు అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. ఇటీవలి కాలంలో జిల్లాలో పలుచోట్ల టన్నుల కొద్దీ బియ్యం పట్టుబడడం జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఈనెలలో ఇప్పటివరకు ఏకంగా మూడు కేసులు నమోదు కావడం గమనార్హం. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తేనే అధికారులు స్పందిస్తుండడంతో కొన్నిచోట్లే వెలుగు చూస్తున్నాయి. సాధారణ రోజుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో యథేచ్ఛగా వ్యాపారం సాగుతోంది.

ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

- యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న రేషన్ బియ్యం
- జిల్లాలో పలుచోట్ల పట్టుబడుతున్న బియ్యం నిల్వలు
- మూడు వారాల్లో మూడు కేసులు
- బియ్యం నిల్వలపై కొరవడిన తనిఖీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) ద్వారా ప్రభుత్వం జిల్లాలో ప్రతి నెలా సుమారు 6.60 లక్షల మందికి బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార అందిస్తోంది. వీరిలో రేషన్ బియ్యం అవసరం లేని వారిని వ్యాపారులు గుర్తించి, వారి నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో చిన్న చిన్న కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్న చిరువ్యాపారులు కొందరు చౌక ధరల దుకాణాలు అందిస్తున్న బియ్యాన్ని కేజీ రూ.14 నుంచి రూ.15 మధ్య కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాలంటీర్లే వారి వేలిముద్రలు వేసి బియ్యం అందించినట్లుగా లెక్క చూపి, అలా మిగిలిన బియ్యాన్నీ కొనుగోలు చేస్తున్న సందర్భాలు గతంలో వెలుగు చూశాయి. లబ్ధిదారులకు కొంత సరుకు పంపిణీ చేయగా ఎండియు వాహనాలు, రేషన్ దుకాణాల్లో మిగిలిన బియ్యాన్నీ వ్యాపారులు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలా పెద్దఎత్తున బియ్యాన్ని నిల్వ చేస్తున్న క్రమంలో అధికారులకు పట్టుబడుతున్నారు. గ్రామాల్లో, వీధుల్లోని చిల్లర దుకాణాలు రూ.14 నుంచి రూ.15 మధ్య కొనుగోలు చేస్తుంటే, వాటిని పెద్ద వ్యాపారులు రూ.20 వరకు చెల్లించి కొంటున్నారు.

మూడు వారాల్లో మూడు కేసులు

బియ్యం అక్రమ నిల్వలు, రవాణాతో కొందరు వ్యాపారులు విజిలెన్స్ అధికారులకు పట్టుబడుతున్నా ఆ పరంపర ఆగడం లేదు. సరుబుజ్జిలి కూడలి వద్ద బొలేరో వ్యాన్‌తో తరలిస్తున్న రూ.1.33 లక్షల విలువ గల 35 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు ఈనెల 20వ తేదీన పట్టుకున్నారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలో ఈనెల 18న అక్రమంగా నిల్వ చేసిన రూ.49,400 విలువ గల 24 బస్తాల బియ్యాన్ని గ్రామానికి చెందిన కోరాడ గోవిందరావు నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం నగరం బలగలోని జామి విష్ణుమూర్తి బియ్యం దుకాణం నుంచి మార్చి ఒకటో తేదీన రూ.25,800 విలువ గల 30 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎల్.ఎన్ పేట మండలం చొర్లంగిలో గత నెల 22వ తేదీన మల్లా సూర్యనారాయణ ఇంటిపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.నాలుగు లక్షల విలువ గల పది టన్నుల బియ్యం పట్టుకున్నారు.

బియ్యం నిల్వలపై తనిఖీలేవి?

బియ్యంతో పట్టుబడిన వ్యక్తులకు రైసు మిల్లు ఉంటే పోనీ పౌర సరఫరాల సంస్థ ధాన్యం మర ఆడించేందుకు ఇచ్చినట్లుగా అనుకోవచ్చు. కనీసం బియ్యం వ్యాపారం చేస్తున్నా అంద పెద్ద మొత్తంలో నిల్వ ఉంచినా అర్థముంఇ. టన్నుల కొద్దీ బియ్యం నిల్వ ఉంచడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. జిల్లాలోని పలుచోట్ల ఈ దందా సాగుతోంది. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదులు వస్తేనే స్పందిస్తున్నారు తప్ప ఇతర సందర్భాల్లో స్పందించడం లేదు. రైసు మిల్లులు, బియ్యం వ్యాపారుల దుకాణాల్లోనూ తనిఖీలు పెద్దగా చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కాకినాడ పోర్టుకు రేషన్ బియ్యం?

జిల్లాలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్న రేషన్ బియ్యం కాకినాడ పోర్టుకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి షిప్‌ల ద్వారా విదేశాలకు వెళ్తున్నట్లు గతంలో అనేక వార్తలు వచ్చాయి. ప్రధానంగా ఆఫ్రికన్ దేశాలకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్కడ కిలో రూ.50 నుంచి రూ.60 వరకు అమ్ముడుపోతున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ సాగుతోంది.

రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

వసతిగృహంలోకి వర్షపు నీరు

- తడిచిన బియ్యం, పుస్తకాలు
- ఆందోళన చేపట్టిన విద్యార్థులు
- సమస్య పరిష్కారానికి సబ్ కలెక్టర్ హామీ

ప్రజాశక్తి - కొత్తూరు

వర్షపునీరు వెళ్లే కాలువను మూసివేయడంతో మండల కేంద్రంలోని ఎస్‌సి బాలుర వసతిగృహంలోకి బుధవారం రాత్రి వర్షపు నీరు చేరింది. దీంతో ఐదు బస్తాల బియ్యం, పుస్తకాలు తడిచిముద్దయ్యాయి. వసతిగృహంలో విద్యార్థులు ఉండేందుకు వీల్లేకపోవడంతో వార్డెన్ ఉమాశంకరరావు 35 మంది విద్యార్థులను పారాపురం హాస్టల్‌కు రాత్రిపూట తరలించారు. పుస్తకాలన్నీ తడిచిపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు వీల్లేకుండా పోయాయి. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, దళిత సంఘ నాయకులు యడ్ల గోపి వసతిగృహాన్ని పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ రహదారి పక్కన కాలువపై పలకలు తొలగించి మట్టి పూడ్చివేయడంతో మురుగు, వర్షపునీరు వెళ్లే అవకాశం లేకుండా పోయి రోడ్డు పైనే ప్రవహిస్తోందన్నారు. భారీ వర్షానికి నీరు వసతిగృహంలో చేరడంతో విద్యార్థుల పుస్తకాలు, పెట్టెలు, బియ్యం తడిచిపోయాయని తెలిపారు. ఉండేందుకు వీల్లేకపోవడంతో విద్యార్థులు ఎక్కడ తలదాచుకుంటారని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించుకుంటే తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గంటపాటు ఆందోళన కొనసాగడంతో ట్రాఫిక్ స్తంభించింది. అక్కడకు చేరుకున్న పోలీసులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీనివ్వడంతో రాస్తారోకోను విరమించారు.

విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గడ్డెమ్మ, తహశీల్దార్ బాల వసతిగృహాన్ని పరిశీలించారు. కాలువను మూసివేయడం వల్లే సమస్య ఉత్పన్నమైందని, దీనివల్ల విద్యార్థులు పడుతున్న అవస్థలను సిర్ల ప్రసాద్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాలువను ఎవరు మూసివేశారని తహశీల్దార్ పి.బాలను సబ్ కలెక్టర్ అడిగారు. పొలాల్లోకి చెత్త వస్తుండడంతో తామే మూసివేశామని రైతులు లక్ష్మీనారాయణ, హరికృష్ణ తెలిపారు. కాలువలు కప్పడానికి వీల్లేదని, వెంటనే తొలగించాలని ఆదేశించారు. నాలుగు అడుగుల కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు.

వర్షపు నీటికి తడిచిన బియ్యం బస్తాలు

చేనేత ప్రదర్శనను తిలకిస్తున్న వస్త్రాభిమానులు

'చేనేత'కు విశేష స్పందన

ఐదు రోజుల్లో రూ.15 లక్షల వస్త్రాలు అమ్మకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చేనేత వస్త్రాలపై జనం విశేష ఆదరణను కనబరుస్తున్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో చేనేత జౌళి శాఖ ఈనెల 19 నుంచి ప్రదర్శిస్తున్న చేనేత ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన వస్తోంది. శ్రీకాకుళం నగరంతో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన చేనేత వస్త్రాభిమానులు అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారు. ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు రూ.15 లక్షల ఆదాయం వచ్చినట్లు జిల్లా చేనేత, జౌళి అధికారి ఐ.ధర్మారావు తెలిపారు. రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన ధర్మవరం, వెంకటగిరి, ఫణిదం, పుత్తూరు, చీరాల, ఉప్పాడ, బొబ్బిలి రకాలకు చెందిన కాటన్, సిల్క్, జరీ చీరల కొనుగోళ్లకు జనం ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, కలంకారీ వస్త్రాలు, తువ్వాళ్లు, డర్రీలు, కార్పెట్లు, లుంగీలు, పొందూరు షర్టింగ్, పంచెలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి అయిన ప్రసిద్ధ చేనేత వస్త్రాలు బాగా అమ్ముడుపోతున్నాయని వివరించారు. ఈనెల 25వ తేదీతో ప్రదర్శన ముగియనుందని, వస్త్రాభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్మించడమే భగత్‌సింగ్‌కు ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. స్వాతంత్ర్య పోరాట అమరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి గురువారం నివాళ్లర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదం, దోపిడీ పీడనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన పోరాట యోధులు అని కొనియాడారు.

నేడు భారతదేశ సంపద బిజెపి అండతో అదానీ, అంబానీలు లూటీ చేస్తున్నారని విమర్శించారు. అదానీ కుంభకోణంపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. ప్రకృతి వనరులైన భూమి, నీరు, గాలి, సూర్యరశ్మి, అడవులు, గనులు ప్రతిదీ అదానీ కంపెనీ వశం చేసుకునేందుకు డేగలా వాలుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ దన్నుతో రాష్ట్రాన్ని నిలువునా దోచుకోవడానికి ఉరుకులు, పరుగులు పెడుతోందని విమర్శించారు. మోసం, దగాలతో ఎనిమిదేళ్లలో ఉన్నత శిఖరాలకు చేరిందన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికతో దాని అసలు రంగు బయటపడిందని తెలిపారు. ప్రపంచస్థాయిలో అప్రతిష్టపాలై, దేశంలో ప్రభుత్వరంగాన్ని కొల్లగొట్టిన మహా కుంభకోణంపై దేశ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. ప్రభుత్వ ఆస్తులనే కాదు ప్రజల ఆస్తులనూ అదానీ కొల్లగొడుతున్నాడని విమర్శించారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, నాయకులు కొత్తకోట అప్పారావు, ఎ.సత్యం, ఎం.ఆదినారాయణమూర్తి, ఎం.గోపీనాథ్, కె.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

అకాల వర్షంతో నష్టం

జి.సిగడాంలో కురుస్తున్న వర్షం

పొందూరు : బురిడికంచరాంలో నేలవాలిన మొక్కజొన్న

ప్రజాశక్తి - పొందూరు

అల్పపీడన ద్రోణి అన్నదాతల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. జిల్లాలో కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంటలకు నష్టం కలిగింది. అత్యధికంగా కొత్తూరులో 52.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలో 1.2 మి॥మీ అత్యల్పంగా వర్ష పాతం నమోదైంది.కవిటిలో 44.6 మి॥మీ, వజ్రపుకొత్తూరులో 44.2మి॥మీ, నందిగాంలో 36.8 మి॥మీ, పలాసలో 30.2 మి॥మీ, కంచిలి 26.4 మి॥మీ, పాతపట్నం 21.6 మి॥మీ, హిరమండలం 21.4 మి॥మీ, వర్షపాతం నమోదైంది. మెళియాపుట్టి, సోంపేట, టెకకలి, ఇచ్ఛాపురం, సారవకోట, మందస, ఎల్.ఎన్‌పేటలో 15 మి॥మీ కంటే తక్కువ వర్షపాతం నమోదుకాగా, మిగతా మండలాల్లో పూర్తిగా వర్షపాతం నమోదు కాలేదు.

నేలకొరిగిన మొక్కజొన్న

అల్పపీడన ద్రోణి కారణంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పొందూరు మండలంలోని పలు గ్రామాల్లోని మొక్కజొన్న రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గురువారం మధ్యాహ్నం గాలి వానకు పంట చేతికొచ్చిన మొక్కజొన్న నేలమట్టమైంది. మండలంలోని లైదాం, బురిడికంచరాం, రాపాక, వి.ఆర్.గూడెం, తుంగపేట, కొంచాడ, ఇల్లయ్యగారిపేట, కోటిపల్లి, దల్లవలస, కృష్ణాపురం, వావిలపల్లిపేట, పుల్లాజీపేట, లోలుగు, నందివాడ, బాణాం, దల్లిపేట, తండ్యాం, మలకాం తదితర గ్రామాల్లో రైతులు 2,580 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారు. ఇప్పటికే పలువురు మొక్కజొన్న పొత్తులను కోయగా, మరికొందరు కోసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పొత్తులు తడిసిపోగా, ఇంకా కోయడానికి సిద్ధంగా ఉన్న పంట నేలకొరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఏటా పంట చేతికి వచ్చే సమయానికి ఏదో ఒక రూపంలో ఈ విధంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

జి.సిగడాంలో భారీ వర్షం

జి.సిగడాం: మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర ఎక్కువగా ఉంది. 3.30గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. చిన్నగా ప్రారంభమైన ఈదురు గాలులు తరువాత బలంగా గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండలంలో వాండ్రంగి వెళ్లే దారి మధ్యలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. వర్షం వల్ల మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ ఎఇ తిరుపతిరావు సమక్షంలో సిబ్బంది స్తంభాలను సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు. పలు చోట్ల మొక్కజొన్న నేలకు ఒరిగిపోయింది. జీడి, మామిడి పిందెలు నేలరాలాయి. తాము పంట నష్టపోయామని రైతులు ఆవేదన చెందారు.

ఆబోతులపేటలో ఇంట్లో చేరిన జలమయమైన రోడ్డు

ఆమదాలవలస: మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు కురిసిన భారీ వర్షానికి మండలంలోని కొత్తవలస, చీమలవలస తదితర గ్రామాల్లోని రోడ్లపై నీరు ప్రవహించింది. కాలువల్లో పూడికలు పేరుకుపోయి వర్షపు నీరు పోయే దారి లేక రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. కొత్తవలస, ఇసకలపేట, పాతనిమ్మతొర్లాడ, కలివరం గ్రామాల్లో తయారైన పచ్చి ఇటుకలు దెబ్బతిన్నాయి.

శ్రీకాకుళంలో మధ్యాహ్నం 2.45 నుంచి 4గంటల వరకు వర్షం కురిసింది. దీంతో పలు రోడ్లపైకి వర్షపునీరు చేరింది. దీంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అవగాహనతోనే క్షయ నివారణ

డిఎంఅండ్‌హెచ్‌ఒ బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అవగాహనతోనే క్షయ నివారణ సాధ్యమవుతుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినంపై జిల్లా క్షయ నివారణ అధికారి అనురాధతో కలిసి జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షయ నివారణకు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అవసరమన్నారు. క్షయ అంటువ్యాధి అని, ట్యూబర్‌క్లోసిస్ అనే మైక్రో బ్యాక్టీరియా ద్వారా ఇది సంక్రమిస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడడం, ఛాతినొప్పి, సాయంకాలం జ్వరం, రాత్రి నిద్రలో చెమట పట్టడం క్షయ రోగి లక్షణాలని వివరించారు. గతేడాదిలో జిల్లాలో 3260 టిబి కేసులు నమోదయ్యాయని, వాటిని పూర్తిగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీటిలో మొండి కేసులు 74 వరకు ఉన్నాయని, వారు ఇంటి వద్దే ఉండి ఆరు మాసాల చికిత్సను తీసుకోవడం ద్వారా పూర్తిగా నయమవుతుందన్నారు. గతేడాది 76 మంది క్షయ రోగులు మృత్యువాత పడ్డారని తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులకు సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 2.5 లక్షల జనాభాకు, ఏజెన్సీ ప్రాంతాల్లో 1.5 లక్షల జనాభాకు ఒక టిబి యూనిట్, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లక్ష జనాభాకు కళ్లె పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 12 టిబి యూనిట్లు, 31 కఫం పరీక్షా కేంద్రాల ద్వారా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌టిపిసిఆర్ మిషన్ ద్వారా డ్రగ్ రెసిస్టెంట్ టిబిని రెండు గంటల్లో నిర్ధారిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్ష ఉచితంగా చేయడంతో పాటు రోగులకు వైద్య సిబ్బంది ఇంటికి వెళ్లి ఉచితంగా మందులు అందిస్తారని చెప్పారు. ప్రతి రోగికి నెలకు రూ.500 ఆర్థికసాయం, ఇతర సంస్థల సహకారంతో నెలకు రూ.700 విలువ గల రేషన్ సరుకులను ఆరు నెలల పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ట్రీట్‌మెంట్ తర్వాత రూ.వెయ్యి అందజేస్తామన్నారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ సోకిన రోగికి టిబి సోకడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని తెలిపారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ రోగులు ఎక్కువగా క్షయ వ్యాధితో మరణిస్తున్నారన్నారు. హెచ్‌ఐవి పరీక్షలను ఐసిటిసి కేంద్రాల్లో ఉచితంగా చేసుకోవాలన్నారు. 2025 నాటికి క్షయ వ్యాధిని జిల్లాలో పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రపంచ క్షయ నివారణ దినాన్ని పురస్కరించుకుని విశేష సేవలందించిన వైద్యులకు ఈనెల 24వ తేదీన సత్కరించనున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్మిక, కర్షక హక్కుల కోసం... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీలో భాగంగా కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ కార్మికులు, కర్షకులకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, స్కీమ్ వర్కర్లు, డైలీవేజ్ కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికుల రెగ్యులరైజేషన్, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధాన్ని పునరుద్ధరించాలన్నారు. పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, కేరళ తరహా రైతు రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, నాయకులు ఎ.సత్యనారాయణ, ఎం.ఆదినారాయణ మూర్తి తదితరులు

త్వరితగతిన రీ సర్వే

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో చేపడుతున్న సమగ్ర భూ రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఫేజ్-1 కింద చేపట్టిన రీ సర్వే అప్‌లోడింగ్‌లో జాప్యం లేకుండా బిఎల్‌ఆర్ విధానాన్ని వినియోగించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 924 గ్రామాల సర్వే నివేదికలను మాత్రమే అప్‌లోడ్ చేశారని, మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తి చేసి త్వరితగతిన అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వెబ్‌లాండ్ 2.0లో నగదుతో సంబంధం లేకుండా అప్‌లోడ్ చేయాలని చెప్పారు. వీటికి అవసరమైన నగదును ప్రభుత్వమే సమకూరుస్తుందని స్పష్టం చేశారు. తహశీల్దార్లు సంతకాలు చేయని వాటిని తక్షణమే సంతకాలు చేసి వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రోన్ పద్ధతిలో బిఎల్‌ఆర్‌ని పూర్తి చేస్తున్నామని, రీ సర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఎడి కె.ప్రభాకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి

మహారాజ శ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ - టెక్కలి

HMOP 79/2022

Between: **పువ్వల రమేష్**,S/o రామారావు, వయస్సు 33 సంవత్సరాలు, గూడెం గ్రామం టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా. **-పిటిషనర్**

మరియు :

1.పువ్వల కావ్య @ జయలక్ష్మి, W/o పువ్వల రమేష్, D/o కోలా ధర్మా రావు, వయస్సు 28 సంవత్సరాలు, D.No. 15-1-233, లేబర్ కోలని, పురుషోత్తపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, శ్రీకాకుళం.

2. పల్లి విశాల్ S/o ధర్మారావు, వయస్సు 28 సంవత్స రాలు, D.No.15-1-83, మారుతి నగర్,లేబర్ కోలని, పలాస-కాశీబుగ్గ మున్సి పాలిటీ, శ్రీకాకుళం.

-రెస్పాండెంట్స్

పై నెంబరు గల కేసు లో పీటీషనరు ఒకటవ రెస్పాండెంట్ నుండి విడాకులు కోరుతూ పై కోర్ట్ లో పిటిషన్ దాఖలు చేసి యున్నారు. సదరు **పిటిషన్ నెం H.M.O.P.79/2022** గా నమోదు అయిఉన్నది, సదరు పిటిషన్ లో గౌరవ శ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ టెక్కలి వారు రెస్పాండెంట్లు కు నోటీసులు జారీ చేసియున్నారు. సదరు నోటీసులు ప్రకారం **తేదీ 03 ఏప్రిల్ 2023 న ఉదయం 10.30** లకు గౌరవ శ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ టెక్కలి వారి కోర్టు లో పైన తెలిపిన రెస్పాండెంట్లు స్వయంగా గాని మీ న్యాయవాది ద్వారా గాని హాజరు కాగలరని ఇందుములాంగా తెలియజేయడమైనది లేని యెడల మీ పరోక్షం లో పీటీషనరుకు ఎక్స్‌పార్టీ విడాకుల డిక్రీ జారీ చేయబడునని తెలియజేయడమైనది.

// BY ORDER //

ఎల్ బాలకృష్ణ
పీటీషనరు తరపు న్యాయవాది,
టెక్కలి, శ్రీకాకుళం జిల్లా

సిఎం దృష్టికి జిల్లా సమస్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సిఎంకు సమస్యలు వివరిస్తున్న విజయ

జిల్లా అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని సిఎం వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డిని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ మేరకు తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లా లోని 38 మండలాల్లో సిపిడబ్ల్యుఎస్ సీమ్ ల నిర్వహణలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు బకాయి పడిన జీతాల బిల్లులు చెల్లించాల ని కోరారు. జీతాలు లేకపోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాగే 14, 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ నిధులు రూ.6,71,31,040 సిఎఫ్ఎంఎస్ పోస్టల్‌లో పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. జిల్లాలోని బెంతు ఒరియా విద్యార్థులకు ఈ ఏడాది జగనన్న విద్యా దీవెన పథకం వర్తింపజేయలేదని అన్నారు. కవిటి మండలం ఇద్దువానిపాలెం గ్రామస్తులకు ఇళ్లు నిర్మించుకునే విధంగా ఆర్థికసాయం అందించాలని కోరారు. సోంపేట వద్ద పవర్ ప్లాంట్‌కు ఇచ్చిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలని కోరారు.

రవికుమార్‌కు కేక్ తినిపిస్తున్న లక్ష్మీదేవి

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆత్మప్రభోదం వల్లే టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి అనురాధ విజయం సాధించారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి గురువారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్సీగా అనురాధ విజయానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసిన జగన్‌కు అభినందిస్తున్నామని అన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరమని వైసిపి నేతలే గుర్తించారని అన్నారు. ఆత్మ ప్రభోదానుసారం ఓటు వేసిన వారందరికీ దన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పట్టభద్రులు వ్యతి రేకించారని, ఇప్పుడు సొంత ఎమ్మెల్యేలే వ్యతిరేకించారని అన్నారు.

రూ.83 వేల తక్కువకు వేలంపాట

పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జీడితోట వేలం పాట రూ.83వేలు తక్కువకు వెళ్లింది. ఈ పాటలో కోడూరు, మగత పాడు గ్రామాలకు చెందిన 8 మంది పాల్గొన్నారు, కోడూరు రెవెన్యూ పరిధిలోని జీడి తోట ఒక ఏడాది పాటు పంట అనుభవించేందుకు పాట నిర్వహించారు. సర్కారు వారి పాట ధర రూ.2,13,450గా నిర్ణయించారు. ఎవరూ పాటకు ముందుకు రాలేదు. ఈ ఏడాది పంట ఎక్కువగా లేదని అందరూ తెలుపగా చివరకి మగతాపాడు గ్రామానికి చెందిన పైల అప్పన్న రూ.1,30,000 రూపాయలకు పాట ఖరారైందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఉప ఎంపిపిలు కె.తాతారావు, కె.అప్పారావు, అధికారులు బలగ సూర్యప్రకాష్, దేవరాజ్, నగేష్, యర్రయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాటాలు స్ఫూర్తి

నగరంలో కాగడాల ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్ : సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ద్వారానే భగతసింగ్‌కు నిజమైన నివాళి అని ప్రజాసంఘాల నాయకులు జి.సింహాచలం, టి.తిరుపతిరావులు అన్నారు. నగరంలోని పాత బస్టాండ్ వద్ద భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్థంగా సందర్భంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. పొట్టిశ్రీరాములు కూడలి వరకు సాగిన ఈ ప్రదర్శనలో వారు మాట్లాడారు. దేశ విముక్తి కోసం పోరాడిన మహనీయులు త్యాగాలు మరువలేనివన్నారు. నేటి సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా మరో స్వతంత్ర పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. దేశంలో మతతత్వ రాజకీయాలు చెలరేగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు రెడ్ కార్పెట్లు పరిచే దౌర్భాగ్యం దేశానికి దాపురించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.పార్వతీశం, కె.అప్పలరాజు, కె.వేణుగోపాల్, ఎన్.పార్థసారధి, ఇందుమతి, రవనమ్మ, రామచంద్ర, రసూల్, గణేష్, రాజులు, ఎర్రయ్య పాల్గొన్నారు.

కవిటి: స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో రాజగురు సుఖ్‌దేవ్, భగత్ సింగ్ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బిందుమాధవి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లవర్పించారు. విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శనతో మౌనం పాటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలోని ఎఎఫ్‌కెకె సంఘం సమీపంలో భగత్‌సింగ్ వర్థంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక సభ్యులు కుమిలి రాజేష్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కాళ్లకూరి శాంతారాం, యువకులు రమణ, కిరణ్, గణేష్, గోవింద, సంతోష్, మురళి పాల్గొన్నారు.

ధర్మవరంలో...

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు టేకి ఆచారి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్నవయసులోనే ఉరి కొయ్యను ముద్దాడి ప్రాణాలర్పించిన యోధుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించడానికి తన ప్రాణాలను సైతం బలిచేసిన వీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్‌లని, వారి ఆశయాలను ఆచరణలో ముందుకు వెళ్లడమే ఆ వీరులకు ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో కె.ప్రకాష్, కె.సూర్యనారాయణ, బి.జగదీష్, నందీశ్వరరావు, మహేష్, కిరణ్ పాల్గొన్నారు.

రణస్థలం: భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అన్నారు. భగత్‌సింగ్ వర్థంతి సందర్భంగా పైడిభీమవరం సిఐటియు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం నాయకులు వెలమల రమణ, సిఐటియు నాయకులు గొర్లె కృష్ణ, వెంపడాపు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని లొద్దపుట్టి గ్రామంలో జన సైనికులు నిర్మించిన భగత్‌సింగ్ విగ్రహాన్ని జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు గురువారం ఆవిష్కరించారు. భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో తిప్పన దామోదరరెడ్డి, రోకళ్ల భాస్కరరావు, తిప్పన రవి, శంకర్, హరీష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: జలకలింగుపురంలో భగత్‌సింగ్ విగ్రహానికి జనసేన నాయకుడు దుక్క బాలరాజు, యువజన సంఘం అధ్యక్షుడు మజ్జి సతీష్‌కుమార్ పూలమాలేసి, నివాళు లర్పించారు. కార్యక్రమంలో బి.సింహాచలం, మణికంఠ, జి.రవికుమార్, ఎన్.లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: పట్టణంలోని ఎస్‌సి బాలుర వసతిగృహంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో హేమంత్, బాలకృష్ణ, చిరంజీవి, కృష్ణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పలాస: భగత్‌సింగ్ ఆశయ సాధనలో సమరశీల పోరాటాలు సాగించడమే మన ముందున్న కర్తవ్యం అని సిఐటియు నాయకులు ఎన్.గణపతి అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.ఓంకార్, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, జి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం ఒడిశా రాష్ట్ర కమిటీ నాయకులు జగన్నాథ్ మిశ్రా, జిల్లా కమిటీ కార్యదర్శి దిండపాని రైతో, జిల్లా కమిటీ సభ్యులు ముచ్చి బంగారయ్య, మొహితో మిషల్, పర్లాకిమిడి పట్టణ బాధ్యులు డి.వెంకటరావు, సభ్యులు శ్రీను బెహరా పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : కాగడాల ప్రదర్శన చేస్తున్న నాయకులు

రణస్థలం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిఐటియు నాయకులు

ఎచ్చెర్ల : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఆచారి

ఇచ్ఛాపురం: విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న జనసేన నాయకులు

పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న గణపతి, ఓంకార్

మెళియాపుట్టి : విగ్రహానికి పూలమాల వేస్తున్న బాలరాజు

కవిటి : చిత్రపటాల వద్ద కొవ్వొత్తులతో నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

రెండేళ్లలో ఏం అభివృద్ధి చేశారు?

మున్సిపాలిటీలో సమస్యలపై టిడిపి నాయకుల ధర్నా

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టిడిపి నాయకులు గురువారం మున్సిపల్ కార్యాటయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జా బాబురావు మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం నూతన పాలకవర్గం ఏర్పడి నేటికి రెండు ఏళ్లు పూర్తయ్యిందని, పురపాలక సంఘంలో ఎటువంటి పురోగతి కనిపించకపోవటం శోచనీయం అన్నారు. పాలకవర్గానికి తెలియకుండా రూ.66 లక్షలు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, నివేదిక

ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుండి పలాస ఇందిరా చౌక్ వరకు ప్రతిపాదించిన రోడ్ల విస్తరణ పనులు నేటికి పూర్తికాక నగరం అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. కాలువ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం వల్ల వర్షం పడితే మురుగునీరు రోడ్లపైకి వస్తోందని వాపోయారు. వేసవిలో ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడం లేదన్నారు. వీధి దీపాలు వెలగడం లేదని, పార్కు అభివృద్ధికి రూ.85 లక్షలు వెచ్చించినా పనుల్లో ఎటువంటి మార్పు లేదని చెప్పారు. ఇంగిలిగాంలోని 13వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన డంపింగు యార్డు నుండి మున్సిపాలిటీకి ఎటువంటి ఆర్థిక లాభం లేదన్నారు. మున్సిపాలిటీలోని కాలువలు, చెరువులు, దేవాలయ, కొండలు అన్యాక్రాంతం అవుతున్నాయని, దీనిపై అధికారుల చర్యలు లేవన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయుకులు లొడగల కామేష్, పి.విఠల్, సూర్యనారాయణ, సురేష్, శంకర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు విరాళంగా ఇవ్వండి

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న గ్రంథాలయానికి దాతలు ఓ పుస్తకాన్ని విరాళంగా అందించాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. అక్షర పేరుపై గ్రంథా లయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లోగోను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు వినియోగంలోకి వచ్చేలా స్వచ్ఛందం గా పుస్తకాలు అందించి, గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ 'వేపాడ'కు అభినందనలు

కవిటి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికైన వేపాడ చిరంజీవిని మండలంలోని టిడిపి నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. విశాఖపట్నంలోని ఆయన నివాసంలో కలిసి స్థానిక సమస్యలు వివరించారు. ఇదే ఉత్సాహంతో ఉద్యోగుల, పట్టభద్రుల సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై పోరాడాలని ఆయన కోరారు. వేపాడని కలిసిన వారిలో మణిచంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, రంగా రౌలో తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి :మండలంలోని నారాయణవలస సంత సమీపంలో గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురుకు గాయాలయ్యాయి. జలుమూరు మండలం రాయపాడుకు కింజరాపు శ్రీను, మూకళ్ల లక్ష్మీనారాయణ, దుంగ ఆదినారాయణలు ద్విచక్ర వాహనంపై చల్లవానిపేట వైపు వెళ్తున్నారు. నారాయణవలస మలుపు వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. ఆదినారాయణ కాలు విరిగిపోయింది. వెంటనే స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో ఇద్దరికి...

మెళియాపుట్టి : మండలంలోని చందనగిరి గిరిజనలో గురువారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. జగనన్న ఇళ్ల నిర్మాణ కాలనీలో ఇటుకలు బట్టి ఏర్పాటు చేసుకున్నారు. ఇటుకలు కాలేందుకు అవసరమయ్యే ఊక వేసే పనులు చేస్తున్నారు. ఈ సమయంలో ఎస్.ఆదినారాయణ, సుశీల అగ్నిప్రమాదానికి గురై గాయపడ్డాడు. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చిరు వర్తకుల బాహాబాహీ

ఆమదాలవలస : పురపాలక సంఘం పరిధిలోని మెయిన్ రోడ్‌లో కూరగాయల మార్కెట్ ముందు గత నెలలో ఏర్పాటు చేసిన బడ్డీదారులు, రోడ్డుపైన ఉన్న తోపుడుబళ్ల వ్యాపారుల మధ్య గురువారం బాహాబాహీకి దిగారు. వివరాల్లోకి వెళ్తే... ఆక్రమణదారులు తమ బడ్డీల ముందు తోపుడుబళ్లను తొలగించాల్సిందేనని హుకుం జారీ చేయగా, వర్తకులు ఎదురు తిరగడంతో కొద్దిసేపు అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘర్షణతో మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ కొంతసేపు నిలిచిపోయింది. మార్కెట్ చుట్టూ ప్రభుత్వం కొంత స్థలాన్ని ఉంచింది. అక్కడ కొంతమంది ఇటీవల బడ్డీలను ఏర్పాటు చేయడంతో బాహాబాహీకి కారణమైంది.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ

మెళియాపుట్టి: మండలంలో నడసంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తంగుడు రాజు గురువారం గ్లాసులు పంపిణీ చేశారు. చాపర గ్రామానికి చెందిన ఈయన తన భార్య జ్ఞాపకార్థంగా 40 మంది విద్యార్థులకు వీటిని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ చౌదరి పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్లాసులను పంపిణీ చేస్తున్న రాజు

వాడీవేడిగా పంచాయతీ సమావేశం

అధికారులను నిలదీస్తున్న లోకేశ్వరరావు

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ నెల 9న నిర్వహించిన సమావేశం కోరం లేక వాయిదా పడింది. గురువారం నిర్వహించిన సమావేశంలో 20 మంది సభ్యులకు 14 మంది హాజరయ్యారు. సర్పంచ్ జి.సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ సుజాత సోదరుడు పెత్తనంపై సభ్యుల నుంచి విమర్శలు వినిపించాయి. పంచాయతీ వ్యవహారం చూడటంపై అభ్యంతరం తెలిపారు. వార్డు మెంబరు తోట లోకేశ్వరరావు మాట్లాడుతూ రూ.56వేలు విలువైన కరెంట్ ఫోల్‌ను హయత్‌నగర్‌లో మూడు అంతస్తుల ఇంటికి ఎలా వేశారని, వీధుల్లో ఫోల్ వేయమంటే ఒక్కటి కూడా వేయలేదని, పంచాయతీలో నిధులు లేవంటున్నారని ప్రశ్నించారు. దీనికి స్పందించిన టెక్కలి పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ గతంలో పని చేసిన కార్యనిర్వాహక అధికారి నాలుగు ఫోల్స్ వేసేందుకు డబ్బులు జమ చేశారని తెలిపారు. పంచాయతీ ఆశీల వేలం పాట సభ్యుల దృష్టికి తేకుండా ఎలా వేశారని వార్డు సభ్యుడు ఎ.రవి ప్రశ్నించారు. సమావేశం దృష్టికి తేకుండా జంగిల్ క్లియరెన్స్ కోసం డబ్బులు ఎలా విత్‌డ్రా చేశారని మరో సభ్యుడు డి.పోలయ్య ప్రశ్నించారు. పంచాయతి నిధులు తీవ్ర స్థాయిలో దుర్వినియోగం అవుతున్నాయని పలువురు సభ్యులు సర్పంచ్, పంచాయితీ కార్యనిర్వాధికారిపై ధ్వజమెత్తారు. సమావేశంలో కార్యదర్శి కూన వినోద్‌కుమార్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోగికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని నర్సింగపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి వెంకటరమణ కుటుంబానికి రాంబాబు చారిటబుల్ ట్రస్టు రూ.60,500 ఆర్థిక సాయం చేసింది. వెంకటరమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బ్రెయిన్‌కు గాయం కావడంతో శ్రీకాకుళం జెమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: డోకులపాడు గ్రామానికి చెందిన ఉప్పాడ కోదండరావు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. శస్త్ర చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న జనసేన నాయకులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20వేలు గురువారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వడ్డి బాలకృష్ణ, లండ గిరిబాబు, ఉప్పాడ ఈశ్వరరావు, కర్రి లక్ష్మణరావు, మడ్డు వినయ్, వడ్డి రిషి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

శ్రీకాకుళం అర్బన్: ఉన్నత చదువులకు పదో తరగతి పునాది అని, అందువల్ల ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంతో పాటు, ఎచ్చెర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1200 మంది విద్యార్థులకు గురువారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు.

పరీక్షా సామగ్రిని అందజేస్తున్న సూర శ్రీను

ఉపాధ్యాయులు చెప్పిన విధంగా ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షలు రాసి అత్యధిక మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులకు అట్టా, పెన్ను, పెన్సిల్ తదితర పరీక్ష సామగ్రిని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ తోఫాను అందజేస్తున్న గొండు శంకర్

రంజాన్ తోఫా పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : మంచికి, మానవత్వానికి ప్రతీక రంజాన్ అని సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు, టిడిపి నాయకులు గొండు శంకర్ అన్నారు. నగరంలోని టౌన్ హాల్ రోడ్డులో ఉన్న శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం ప్రారంభాన్ని పురష్కరించుకొని ముస్లిం కుటుంబాలకు గురువారం 200 రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసమన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, పి.వి.రమణ, దొండపాటి నవీన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొల్ల నాగేంద్రయాదవ్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీన్ జోగినాయుడు

సేంద్రీయ వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సేంద్రీయ వ్యవసాయంతోనే అధిక లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం అలికాంలో జాతీయ సేవా శిబిరాన్ని నైర వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ జి.జోగినాయుడు అధ్యక్షతన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి విద్యార్థులు, అధ్యాపకులు అందిస్తున్న సూచనలను, సాగు మెళుకువలను నేర్చుకోవాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయ ఆవశ్యకత, బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. డీన్ మాట్లాడుతూ ఈ శిబిరం వారం రోజుల పాటు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువుల్లో సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, సచ్ఛ భారత్, మొక్కలు నాటడం, భూ సారపరీక్ష - వాటి ఆధారంగా ఎరువుల యాజమాన్యం, గ్రామీణ యువతకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆరోగ్య, కంటి పరీక్షల శిబిరం, ఉద్యాన పంటల యాజమాన్యంపైనా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అలికాం సర్పంచ్ రంధి అప్పలస్వామి, ఎంపిటిసి నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.యస్ రాయ్, డాక్టర్ శ్రీసంధ్య, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, ఎడిఎ, ఎఒ, విఎఎలు, చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'నర్తు'కు సన్మానం

కవిటి: జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన నర్తు రామారావు మండలంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కపాసుకుద్దిలోని రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు రామారావు కుటుంబ సభ్యులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కవిటి, కపాసుకుద్ది సర్పంచ్‌లు పూడి లక్ష్మణరావు, కాయ దమయంతి, డి.గొనపపుట్టుగ, కపాసుకుద్ది సర్పంచ్ ప్రతినిధులు బెందాళం జయప్రకాష్, కాయ భీమసేన్, మాజీ సర్పంచులు పులకల

రామారావును సన్మానిస్తున్న గ్రామస్తులు

శ్రీరాములు, పాండవ శేఖర్, ఎంపిటిసి తడక పార్వతి, నాయకులు బెందాళం రమణమూర్తి, పిన్నింటి జయరాం, పాతిన చంద్రశేఖర్, పాతిన వెంకటరావు, మొగిలిపురి సీతాలు పాల్గొన్నారు.

పలాస బార్ అసోసియేషన్

నూతన కార్యవర్గం ఎన్నిక

పలాస: పలాస బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక తాండ్ర మురళి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్.విశ్వేశ్వర పట్నాయక్, వైస్ ప్రెసిడెంట్‌గా ఫయాజ్ అహ్మద్, సెక్రటరీగా పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీగా అనిల్ రాజు, ట్రెజరర్‌గా వాకాడ రవికుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా న్యాయవాదులంతా నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

మాట్లాడుతున్న సిడిపిఒ పాపినాయుడు

'సిడిఎఫ్'పై శిక్షణ

పొందూరు: అంగన్వాడీ కేంద్రాల్లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (సిడిఎఫ్) విధానాన్ని కార్యకర్తలు పాటించాలని ఐసిడిఎస్ సిడిపిఒ డి.పాపినాయుడు అన్నారు. పొందూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో బెజ్జిపురం యూత్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థ, ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో గురువారం క్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ మోడల్ విధానంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యూత్‌క్లబ్ బాలవికాస్ ప్రాజెక్టు సమన్వయకర్త మేడూరి ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్.ఎం.పురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లోని 75 మంది అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ అందించామని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జి.అప్పలనాయుడు, టి.కరుణాకరరావు, పి.మాధవి, చైల్డ్‌లైన్ మోహర్వాణి, కె.శ్రావణి, ఎల్.కల్పన, జి.హేమసుందర్, డి.బి.రాజు, ఎస్.ఎం.పురం ప్రాజెక్టు సూపర్‌వైజర్లు లక్ష్మి, రత్నం, అరుణ, యశోద పాల్గొన్నారు.

ఘనంగా పోషణ పక్వాడా వేడుకలు

పొందూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో ఐసిడిఎస్ ఎస్.ఎం.పురం, పొందూరు ప్రాజెక్టు సిడిఒ డి.పాపినాయుడు ఆధ్వర్యాన పోషణ పక్వాడా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిరుధాన్యాల ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తమ్మినేని లక్ష్మి, జి.వి.రత్నం, యశోద, అరుణ పాల్గొన్నారు.

ఊట బావి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

పనులు వేగవంతం

ఇచ్ఛాపురం: సమగ్ర మంచినీటి సరఫరా పథకం పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం ఎఐఐబిలో భాగంగా బాహుదా నదిలో చేపడుతున్న ఊట బావి నిర్మాణ పనులను ఆమె కమిషనరు రమేష్‌తో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎఇ కామేశ్వరరావు, చైర్‌పర్సన్ ప్రతినిధి పిలక సంతోష్, కౌన్సిలరు ప్రతినిధి నీలాపు ఢిల్లీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలపై కందిరీగల దాడి

15 మందికి గాయాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కందిరీగల దాడిలో 15 మంది ఉపాధి హామీ కూలీలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని యలమంచిలి గ్రామంలోని పెద్దపూను చెరువులో ఉపాధి హామీ పనులు చేసేందుకు కూలీలు గురువారం వెళ్లారు. పనుల్లో భాగంగా గట్టుపై ఉన్న చెట్లును తొలగిస్తున్నారు. చెట్టుకు ఉన్న కందిరీగల పట్టు కదలటంతో ఒక్కసారిగా కందిరీగలు వారితో పాటు, అక్కడ పనులు చేస్తున్న వారిపై దాడి చేశాయి. దీంతో మిగతా కూలీలు అక్కడ నుంచి పరుగులు తీశారు. ఈ దాడిలో కూలీలు అల్లబోయిన చెల్లయ్య, అల్లబోయిన లక్ష్మి, రోణంకి రమణ, కూన ఢిల్లేశ్వరరావు, కిల్లి నీలాచలం, హనుమంతు రాజారావు, కూన రేవతి, అల్లబోయిన నాగమణి, కవిటి లక్ష్మి, సనపల అచ్చెయ్య, సీపాన రామరావు, వేసవి దాలయ్య, కవిటి అప్పారావు సహా 15 మంది గాయపడ్డారు. వీరిని 108 సహాయంతో కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలను ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వైద్యం అందించిన తీరును వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిని పరామర్శించారు.

పరామర్శిస్తున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సచివాలయ సేవలు మెరుగు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత మెరుగుపర్చాలని జిఎస్‌డబ్ల్యుఎస్ వాసుదేవరావు, టెక్కలి డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ అన్నారు. గురువారం మండలంలోని చీపుర్లపాడు, వండ్రాడ సచివాలయాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, సచివాలయ అధికారుల పనితీరు, హాజరు పట్టిక, తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పనులు కోసం సచివాలయానికి వచ్చిన ప్రజలకు వెంటనే వారి పనులు చేసి పంపించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందజేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుప్పిలి ఫణీంద్రకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'చేయూత'తో మహిళా సంఘాల బలోపేతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైఎస్ఆర్ చేయూత మహిళా సంఘాల బలోపేతానికి దోహదపడుతుందని ఎంపిపి బోర పుష్ప అన్నారు. గురువారం టి.బరంపురంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. వెలుగు ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యాన మండపల్లి తోతూరు, బాలకృష్ణపురం మహిళా సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ చేయూత, చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పెరటి తోటల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం, పచ్చదనం పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసి రామకృష్ణ, గ్రామ సంఘ అధ్యక్షులు సరోజని, దేవకి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆమదాలవలస మండల సమావేశం

ఆమదాలవలస : ఈ నెల 25న ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎం.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశానికి విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపు అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

పొందూరు: ఈనెల 25న ఐసిడిఎస్ ఎస్.ఎం.పురం, పొందూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లోని ఖాళీ పోస్టులకు శ్రీకాకుళంలోని ఐసిడిఎస్ పీడీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సిడిపిఒ డి.పాపినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలల్లో ఖాళీగా ఉన్న మూడు కార్యకర్తలు, 21 సహాయకుల పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న వారు హాజరుకావాలని కోరారు.

రహదారికి శంకుస్థాపన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మెట్టూరు పంచాయతీ వంకులూరు సిసి రోడ్ నుంచి మెట్టూరుకు వెళ్లే మర్రి చెట్టు వరకు రూ.3.85 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ లింగాల సంధ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ వైసిపితోనే గ్రామీణ రోడ్ల అభివృద్ధి జరిగిందని అన్నారు. రాష్ట్ర మంత్రి సిదిరి అప్పలరాజు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి కొండాపు సురేఖ, వైసిపి నాయకులు జోగి అప్పారావు, ఎస్.మోహనరావు, లండ రాజేశ్వరి, ఎం.సావిత్రి, ఆది, శ్రీనివాస్, వల్లభరావు, నేతాజీ, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగించుకోవాలని మండల విప్ బొడ్డు అప్పన్న, చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అన్నారు. మండలంలోని ఊడికలపాడులో ఉగాది సందర్భంగా ఉపాధి హామీ పనులను వీరు ప్రారంభించారు. ఉపాధిహామీ సిబ్బంది చెప్పిన విధంగా రోజుకు 6గంటలు పనిచేస్తే రూ.250లు కూలి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెలమల ఢిల్లేశ్వరరావు, గ్రామ పెద్దలు నేతింటి వెంకటరావు, నేతింటి చిన్నబాబు, మెండ రామ్మూర్తి, సీపాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నమ్మడు

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

ఆమదాలవలస : పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమదాలవలస : అభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. జనవరి 26 నుంచి మార్చి 26 వరకు నిర్వహించనున్న హత్ సే హత్ జోడు యాత్రలో భాగంగా పురపాలక సంఘ పరిధిలోని 22వ వార్డు లక్ష్ముడుపేటలో గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చేయి చేయి కలుపుదాం... రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అంటూ ప్రజలతో కలిసి నడిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాం, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధికి బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. వంట గ్యాస్ ధరలు, నిత్యవసరాల ధరలు సామాన్యులకు అందుబాటులోకి రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో సనపల అన్నాజీరావు, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, ఎం.ఎస్.ఎం.మూర్తి, శ్రీరాములు పాల్గొన్నారు.

టెక్కలిలో...

టెక్కలి: కాంగ్రెస్ పార్టీ విధానాలే దేశాభివృద్ధికి శరణ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక ఆదిఆంధ్రావీధిలో గురువారం సాయంత్రం హత్‌సే హత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పోస్టర్లను అందించారు. పార్టీ విధానాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనందరావు, భాస్కర బాబు, లోపింటి బారతి, దాసరి శ్రీరాములు పాల్గొన్నారు.

వేధింపులో భాగమే రాహుల్‌కు శిక్ష

శ్రీకాకుళం అర్బన్ : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తోందని, రాహుల్‌గాంధీపై పరువు నష్టం కేసు పెట్టి శిక్ష వేయించడం వేధింపుల్లో భాగమేనని జిల్లా కాంగ్రెస్ అద్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి ఒక ప్రకటనలో ఆరోపించారు. స్వాతంత్ర్య ప్రతిపత్తి కలిగిన సంస్థలను అడ్డంపెట్టుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అన్నారు. అదే కోవలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌పై బిజెపి ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేసు బనాయించి రెండేళ్ల శిక్ష పడేటట్టు చేయడం సరికాదన్నారు. ఇటువంటి చర్యలను ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

టెక్కలి : ఇంటింటా కరపత్రాలు అందిస్తున్న నాయకులు

ఉత్సవాల్లోనూ రాజకీయాలా?

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

గ్రామాల్లో నిర్వహించే ఉత్సవాల్లోనూ వైసిపి నాయకులు రాజకీయాలు చేయడం సరికాదని టిడిపి పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కోష్టలోని టిడిపి మాజీ సర్పంచ్, పార్లమెంటరీ నాయకులు పిసిని జగన్నాథంనాయుడును గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం కోష్టలో శ్రీరామనవమి ఉత్సవాల పందిరిరాటకు పోలీసులను ఉపయోగించి టిడిపి నాయకులను నిర్బంధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా పూర్వ అధ్యక్షులు వెలిచేటి జోగిరాజు మౌళి, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, మండల పార్టీ అధ్యక్షులు లెంక శ్యాం, పైడి అప్పడుదొర, కనకారావు, ఎంపిటిసి పిసిని ఆసిరినాయుడు, బోట్ల రాంబాబు, రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న కళావెంకటరావు

దెబ్బతిన్న పంటలు పరిశీలన

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎంపిపి దాసు

సోంపేట: మండలంలోని జింకిభద్ర పంచాయతీలో రైతులు పండిస్తున్న టమెటో పంటను ఎంపిపి డాక్టర్ దాసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న టమోటో పంటను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పంటను సంరక్షించుకొనే మార్గాలను పాటించాలని సూచించారు. అధికారులతో మాట్లాడి పంటకు ఆశించే తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ నరసింహమూర్తి, ఉద్యానవనశాఖ అధికారి మాధవిలత, సర్పంచ్ ప్రతినిధి టి.చంద్రశేఖర్, ఎస్.జానీ, అనంత్, దిలీప్, టి.బాబురావు, టి.బాలరాజు, ఆనంద్, కామేష్‌తో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు

వజ్రపుకొత్తూరు : చిరు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యం మన సొంతం అవుతుందని పలువురు పేర్కొన్నారు. చిరు ధాన్యాల మహోత్సవంలో భాగంగా వెలుగు, జీడి ఉత్పత్తిదారుల సంస్థ, హెల్పింగ్ హేండ్స్ అసోసియేషన్, ఉద్దానం అభ్యుదయ సేవా సమితి సంయుక్తంగా గురువారం తామాడపేటలో అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ చిరు ధాన్యాల ఉత్పత్తికి రైతులు ముందుకు రావాలని అన్నారు. చిరు ధాన్యాలలో అధిక పోషక విలువలు ఉంటాయని అన్నారు. రాగులు, సజ్జలు పంటలను ప్రభుత్వం ప్రోత్సహించి రైతులకు రాయితీలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు డి.ప్రకాష్, చింత కాంతమ్మ, తామాడ లక్ష్మణరావు, మండల మహేష్, బి.కాంతమ్మ, కోల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: చిరుధాన్యాలతో అధిక ప్రయోజనాలు కలుగుతాయని ఎంపిపి కర్నేన దీప అన్నారు. మండలంలోని చిడివలసలో చిరుధాన్యాల ఆవశ్యకతపై గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సామలు, ఊదలు, గోధుమలు వంటి చిరుధాన్యాలను అనునిత్యం తీసుకోవడంతో దీర్ఘకాలిక వ్యాధులు దరిచారన్నారు. దీనిద్వారా రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఊబకాయం, ఇతర వ్యాధులు నియంత్రణకు వస్తాయని తెలిపారు. జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, ఇ.బాబూరావు, డ్వాక్రా ఇఒ ఎం.ఎస్.మని, సరస్వతి, రమణ, పరమేశ్వరి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

నేడు బైక్‌ల వేలం

ఆమదాలవలస : ద్విచక్ర వాహనాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మెట్టక్కివలసలో నున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామని అన్నారు. గతేడాది వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించబడునని తెలిపారు. ఆసక్తి గల వారు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు కట్టి ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు.

చెక్కును అందజేస్తున్న మేనేజరు కోటేశ్వరరావు

ఇన్సూరెన్స్‌తో మేలు

పోలాకి: పిఎం జీవన జ్యోతి, బీమా యోజన, సురక్ష బీమా యోజన వంతి ఇన్సురెన్సులతో లబ్ధిదారులకు ఎంతో మేలు కలుగుతుందని ఎపిజివిబి మేనేజరు కోటేశ్వరరావు అన్నారు. ఇటీవల ఆర్‌జె.పురానికి చెందిన తూలుగు సత్యనారాయణ అనారోగ్యంతో మరణించారు. ఆయన భార్య అశ్వినికి గురువారం రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఆనందరావు, క్యాసియర్ సీతారామరాజు, విఒఎ బి.భవాని, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆశీలు వేలంపాట

ఆమదాలవలస : పురపాలక సంఘానికి చెందిన రోజువారి మార్కెట్ ఆశీలు, చింతాడ వారపు సంత, కమేళా ఫీజు వసూలు హక్కులకు 2023-24వ ఆర్థిక సంవత్సరం గుత్తకు ఇచ్చేందుకు ఈ నెల 24న మధ్యాహ్నం నాలుగు గంటలకు బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి కమిషనర్ కె.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ఈ వేలం నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి వేలం పాటలో పాల్గొవాలని కోరారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం: రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇచ్ఛాపురం రైతు కుల సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శి తిప్పన కూర్మారావు, డి.విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎల్లమ్మగుడి వద్ద జె.ప్రసాదరావు, ఆసి చిరంజీవులురెడ్డి పర్యవేక్షణలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా దానయ్య, దొర బాబురెడ్డి, పకీరురెడ్డి, లోహిదాస్‌రెడ్డి, పీతాంబరరెడ్డి, ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న వెంకటరమణ

మెరుగైన వైద్యానికి కృషి

జి.సిగడాం : జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపిపి మీసాల సత్యవతి అన్నారు. జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిహెచ్‌సిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది ఉన్నారని, అన్ని మందులూ అందుబాటులో ఉన్నాయని అన్నారు. రోగులు పిహెచ్‌సిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, తహశీల్దార్ పి.వేణుగోపాలరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, పిహెచ్‌సి డాక్టర్ హరితశ్రీ, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

నువ్వలరేవులో పారిశుధ్య పనులు

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవులో ఈనెల 26 తేదీ నుండి జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలు సందర్భంగా గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గురువారం బస్టాండ్, సచివాలయ ఆవరణంలోని వివిధ వీధులు, కూడళ్ల వద్ద యంత్రాలతో గ్రామ పెద్దల సమక్షంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు. ఉత్సవం దృష్ట్యా గ్రామంలో రద్దీ ఎక్కువ ఉంటుందని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

28 నుంచి కళ్యాణ మహోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలో ఉన్న పార్వతీ, కొండమ్మ, సమేత హాటకేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 7 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు పెంట రామకృష్ణశర్మ, చిట్టిబాబుశర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.శివకేశ్వరరావు, ఆలయ ఆనువంశిక ధర్మకర్త గుండ ఆదిత్యానాయుడులు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రధాన మండపంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. 28న చైత్ర శుధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభిస్తామని అన్నారు. స్వామి కళ్యాణంతో పాటు, వివిధ సాంస్కృతిక, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పరికరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కె.ఎల్ నాయుడు

నేత్ర వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస : నేత్ర వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కంటి వైద్యులు కె.ఎల్.నాయుడు అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా నేత్ర వైద్యులు ధవళ కీర్తి అనీష్‌బాబు నిర్మించిన సాయి తేజ పోలీ ఐ క్లినిక్ నూతన ఆస్పత్రిని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ కళ్లు ఎంతో ముఖ్యమైనవని, అవి సక్రమంగా ఉంటేనే ప్రపంచాన్ని చూడగలుగుతామని అన్నారు. లేకుంటే జీవితం అంధకారమేనన్నారు. సాంస్కృతిక మండల బోర్డు రాష్ట్ర డైరెక్టర్ జె.జె.మోహనరావు, పట్టణ కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు శిల్లా మల్లికార్జునరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర కృష్ణవేణి వైద్యులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని కొండ పోలమ్మ కాలనీలో ఉన్న కొండ పోళమ్మ ఆలయానికి వచ్చే యాత్రికులు నీరు తాగేందుకు బోర్‌వెల్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. యాత్రికుల ఇబ్బందులను చూసిన వైసిపి జిల్లా ప్రచార కమిటీ చైర్మన్, వార్డు కౌన్సిలరు తాడి ఆదిరెడ్డి, ప్రముఖ జ్యోతిష్య సిద్ధాంతి టి.తేజేశ్వర్ శర్మ వితరణ చేశారు.